క్లుప్తంగా

విద్యార్థులకు షూ పంపిణీ



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తానని పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాటి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం 150 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చుతో షూ, సాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డిని డోజర్‌తో తొలగించి చదును చేయించారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆయనను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు ఉమాదేవి, అలివేలు, బిబి హజ్రా, నాయకులు వీరారెడ్డి, ఓంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, శంకర్, మల్లేశ్, నిజాం, జనార్దన్‌రెడ్డి, నర్సింహ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: గ్రామ పంచాయతీ కార్మికులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి, నెల నెలా సక్రమంగా వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ కోరారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ కమిటీ సభ్యులు ఆర్డీఓ చంద్రకళకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనలు చేయాల్సి వస్తుందన్నారు. వినతిపత్రం అందించిన వారిలో యూనియన్ మండల కార్యదర్శి సీహెచ్ మల్లయ్య, షాబాద్ మండల అధ్యక్షుడు సత్తయ్య, ఉపాధ్యక్షులు రాములు, అంతమ్మ, సాయిలు, లక్ష్మయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించి మంచి భవిష్యత్ పొందాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గందె సురేశ్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం ప్రభుత్వ పాఠశాలలో గ్రామానికి చెందిన ఎల్కుర్తి జగదీశ్వర్ సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యంసాని శ్రీనివాస్, ఎల్కుర్తి నారాయణ, అన్నారి మురళీ, నాగరాజు, నవీన్, మాణిక్యం, వెంకటరమణ, నవీన్‌కుమార్, ఉప్పల శ్రీనివాస్, గుబ్బ సురేశ్, మలిపెద్ది శ్రీనివాస్, బండారి శంకర్, ఉప్పల సత్యం, అశోక్, యశ్వంత్, నీల రవీందర్, వెంకటేశ్‌గుప్తా పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ

కొందుర్గు: మండలంలోని ఉమ్మెంత్యాల గ్రామంలో సోమవారం నాయకులు లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం పేద ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పేదలందరికీ కార్డులు పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉమ్మెంత్యాలలో 14 మందికి కొత్త రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, లక్ష్మయ్య, మల్లేశ్, పాండు, అంజయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, సాయికుమార్, వీరేశ్ పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ

షాద్‌నగర్‌రూరల్: అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టణంలోని పురవీధుల్లో తిరుగుతూ చదువుతో కలిగే ప్రయోజనాలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

- నిరుపయోగంగా మారిన సెగ్రిగేషన్ షెడ్లు
- నామమాత్రంగా చెత్త సేకరణ
- అటకెక్కిన సేంద్రియ ఎరువుల తయారీ
- పట్టించుకోని అధికారులు



ఎస్‌బీపల్లిలో ఎరువుల తయారీ కోసం నిర్మించిన షెడ్డు



కొత్తూరులో నీట మునిగిన షెడ్డు

కొత్తూరు: గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు సొంతంగా ఆదాయ మార్గాలు సృష్టించుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలను నెలకొల్పింది. కాగా వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్నిచోట్ల మాత్రమే ఎరువుల తయారీ సాగుతోంది. ఆదాయం మాట దేవుడెరుగు.. ఎరువుల తయారీ లేని కారణంగా షెడ్లు నిరుపయోగంగా మారాయి. మరికొన్ని చోట్ల అనాలోచిత నిర్ణయాలతో చెరువు గట్లు, ఎఫ్‌టీఎల్‌లో షెడ్లను నిర్మించారు. ప్రస్తుతం చెరువులు నిండుకోవడంతో షెడ్ల వరకు చెత్తను తరలించడం కష్టంగా మారింది.

చెత్త సేకరణ ఇలా..

కొత్తూరు మున్సిపాలిటీలో 12 వార్డులు, 20 వేల వరకు జనాభా, మండలంలోని 12 పంచాయతీల్లో 19 వేల జనాభా ఉంది. నిత్యం పారిశుద్ధ్య సిబ్బంది పట్టణం, గ్రామ పంచాయతీల నుంచి సుమారు ఒక టన్ను వరకు తడి, పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలిస్తున్నారు. మండలంలో 12 పంచాయతీలు ఉండగా కేవలం 03 గ్రామాల్లో మాత్రమే సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు.

ఇదీ లక్ష్యం..

- మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజు పారిశుద్ధ్య సిబ్బంది ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తారు.
- సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువుల తయారీ షెడ్లకు తరలించి అక్కడ మరోమారు తడి, పొడి చెత్తను వేరు చేస్తారు.
- కూరగాయలు, ఇతర తడి వ్యర్థాలతో షెడ్లలోనే అధికారులు సూచించిన విధంగా సేంద్రియ ఎరువులను తయారు చేయాలి.
- షెడ్లలో తయారు చేసిన ఎరువులను పంచాయతీ పరిధిలోని నర్సరీలు, ఇతర అవసరాలకు వినియోగించి మిగిలిన ఎరువులను రైతులకు విక్రయించాలి.
- ఎరువులు, ఇతర ప్లాస్టిక్, సీసాల వ్యర్థాలను సైతం అధికారుల సమక్షంలో విక్రయించి వచ్చిన డబ్బులను పంచాయతీ ఖాతాలో జమ చేయాలి.

నిర్వహణ లేక నిప్పు..

గ్రామాలు, మున్సిపాలిటీలో సిబ్బంది సేకరిస్తున్న తడి, పొడి చెత్తను డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు నీట మునగడంతో గ్రామాలకు దూరంగా ఖాళీ స్థలాల్లో పారబోస్తున్నారు. ప్రత్యామ్నాయం లేక సిబ్బంది చెత్తను వేరు చేయకుండానే నిప్పు పెడుతున్నారు. కొన్ని గ్రామాల్లో షెడ్ల వద్ద చెత్త కుప్పలు, తెప్పలుగా పేరుకుపోతోంది.

కొన్నిచోట్ల మాత్రమే ఎరువుల తయారీ..



గతంలో ఆయా గ్రామాల్లో సెగ్రిగేషన్(సేంద్రియ ఎరువుల తయారీ) షెడ్లను చెరువు గట్లు, నీటి పరివాహక ప్రాంతంలో నిర్మించారు. ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా షెడ్లు నీటితో నిండుకున్నాయి. మండలంలో 12 పంచాయతీలు ఉండగా.. ప్రస్తుతం గూడూరు, మల్లాపూర్‌తాండ, సిద్దాపూర్ గ్రామాల్లో మాత్రమే తడి చెత్తతో ఎరువులను తయారు చేస్తున్నారు.

– విజయలక్ష్మి, ఎంపీఓ

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు



డీలర్లతో మాట్లాడుతున్న ఏడీఏ సురేశ్‌బాబు

మొయినాబాద్: ఫర్టిలైజర్ షాపుల డీలర్లు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు అన్నారు. సోమవారం మొయినాబాద్ రైతు వేదికలో ఫర్టిలైజర్ షాపుల డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల విక్రయ ధరల్లో తేడా లేకుండా ఉండాలన్నారు. బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, యూరియా స్టాక్ ఎంట్రీని తప్పనిసరిగా ఈ–పాస్ యంత్రంలో నమోదు చేయాలని సూచించారు. రైతులు యూరియాను అధికంగా వాడొద్దని.. అది నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. రైతులు సాధారణ యూరియాకు బదులు నానో యూరియా వాడాలని సూచించారు. రైతులకు సరిపడా ఎరువులు అందిస్తున్నామని.. ఒకేసారి రైతులు రావడంతో ఇబ్బంది అవుతుందని.. టోకెన్లు ఇచ్చి అందజేస్తున్నామన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓలు సునీల్, కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

ఆలూరును మండలం చేయాలని వినతి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఆలూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు, అదేవిధంగా ఆలూరు బీటీ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈని గ్రామ బీజేపీ నాయకులు కలిసి కోరారు. సోమవారం ఆలూరు గ్రామ బీజేపీ నాయకులు కుమ్మరి కృష్ణ, మధుమోహన్‌రెడ్డి, కమ్మరి మోహన్, మురళీధర్‌రావు, యాదగిరి, మాణిక్య, కృష్ణ వారి కార్యాలయాలకు వెళ్లి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆలూరులో 12వేల జనాభా ఉందని, 6 వేల ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఆలూరు మండలం ఏర్పాటుకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని చుట్టూ ఉన్న అంతారం, తలారం, తంగడపల్లి, దుద్దాగు, దేవరంపల్లి, గణాపూర్, ఖానాపూర్, మడికట్టు నౌలాయపల్లి, మిర్జాగూడ, హస్తేపూర్ గ్రామాలను కలిపి మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మోహన్ నాయక్‌కు వినతిపత్రం అందించి మాట్లాడుతూ... ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఆలూరు గేట్ నుంచి దుద్దాగు గేట్ వరకు అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల సమస్యలను తీర్చాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు సానుకులంగా స్పందించి పరిశీలిస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



కొందుర్గు: రావిర్యాలలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు



మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

కొందుర్గు: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం గ్రామస్తులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. విద్యార్థులను చక్కని మార్గంలో నడిపించి, వారికి దిశానిర్దేశం చేసే మహనీయులన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుభార్గవి, ఉపాధ్యాయులు పవన్, శివాజీ, ఆఫ్రీన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాకారం ప్రాథమిక పాఠశాలలో నగరంలోని విజయం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 5వ తేదీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని విజయలక్ష్మితో కలిసి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో వార్డుసభ్యుల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక మాజీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందన

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద ప్రాథమికోన్నత పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు కె.బాలాజీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్న సందర్భంగా ఆయనను సోమవారం పాఠశాలలో గ్రామస్తులు, నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో అనుభవం, జ్ఞానం ఉన్న ఉపాధ్యాయులు ఉండటంతో పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోందని అభిప్రాయపడ్డారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశంగుప్తా, గ్రామస్తులు కిష్టయ్య, మల్లయ్య, నర్సింలు, ప్రభాకర్, అంజయ్య, అనిల్, ఆనంద్, యాదయ్య, మల్లేశ్, రామయ్య, ప్రభు, రాజు, ప్రకాశ్, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

మొయినాబాద్ రూరల్: చంద్ర గ్రహణం కారణంగా మూసిన మండల పరిధిలోని కనకమామిడి సంగమేశ్వర దేవాలయాన్ని సోమవారం అర్చకులు సంప్రోక్షణ చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకే ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ నిర్వహించి, స్వామివారికి అభిషేకం చేసిన అనంతరం ఆలయంలో తిరిగి భక్తులకు దర్శనం కల్పించారు. దేవాలయానికి వివిధ ప్రాంతాలతో పాటు జంట నగరాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.

సన్మానం



తూళ్ల వీరేందర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తూళ్ల వీరేందర్‌గౌడ్‌కు పట్టణ బీజేపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా స్వాగతం పలికారు. చేవెళ్ల మీదుగా పరిగి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆయనను సోమవారం సాయంత్రం నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఆయన కలిసిన వారిలో నాయకులు అనంత్‌రెడ్డి, కృష్ణగౌడ్, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్ ఉన్నారు.

అవే తిప్పలు.. అవే బారులు



మొయినాబాద్‌లో బాలాజీ ఫర్టిలైజర్ షాపు వద్దకు బారులు తీరిన రైతులు

మొయినాబాద్: రైతులకు ఇంకా యూరియా తిప్పలు తప్పడం లేదు. ఎరువుల కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం మొయినాబాద్‌లోని బాలాజీ ఫర్టిలైజర్ షాపుకి యూరియా రావడంతో రైతులంతా ఒక్కసారిగా ఎగబడ్డారు. మండల వ్యవసాయాధికారి రైతు వేదిక వద్ద టోకెన్లు ఇవ్వడంతో.. వాటిని తీసుకొని రైతులు ఫర్టిలైజర్ షాపు వద్దకు బారులు తీరారు. శనివారం టోకెన్లు తీసుకున్న 50 మంది రైతులతో పాటు సోమవారం టోకెన్లు తీసుకున్న రైతులకు యూరియా అందజేశారు. వచ్చిన 350 బస్తాల యూరియా అయిపోవడంతో మరికొంత మంది నిరాశతో వెనుదిరిగారు.

ఉచిత వైద్య శిబిరాలు



మొయినాబాద్‌రూరల్: శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ డా.అనితారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గోపులారం మాజీ సర్పంచ్ పాడువు శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా సంగారెడ్డికి చెందిన ఎంఎన్‌ఆర్ మెడికల్ కళాశాల వారు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం పాడువు శ్రీనివాస్ సుమారు 300ల మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. భవిష్యత్తులోనూ మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

పేదలకు ఎంతో మేలు

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలతో ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నగరంలోని ఏఐజీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జనరల్ చెకప్‌తో పాటు పలు వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నాగేశ్వర్‌రెడ్డి, ఆనంద్ కులకర్ణి, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్

షాద్‌నగర్: రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం వెంటనే సరఫరా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాన్ని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతుల సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు కావాల్సిన యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వ్యవసాయ అధికారులు సరైన ముందస్తు ప్రణాళికను రూపొందించకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు సరిగా లేకపోవడంతో రైతులు ఆరుతడి పంటలకు బదులుగా మొక్కజొన్న, పత్తి వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేశారన్నారు. అయితే సరైన సమయంలో పంటలకు యూరియా వేయకపోతే పంట ఎదుగుదల సరిగా ఉండదని, దీంతో రైతులు దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.

స్థానిక ఎన్నికలకు సహకరించాలి

- ఎంపీడీఓ హిమబిందు
- ఎంపీడీఓ కార్యాలయాల్లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



చేవెళ్ల: నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ హిమబిందు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ స్టేషన్‌ల లిస్ట్, ఓటరు జాబితాపై మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పోలింగ్ స్టేషన్‌ల లిస్ట్, ఓటరు జాబితాను ప్రదర్శించామని, దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తప్పులను మంగళవారం పరిశీలన చేసి 10వ తేదీన తుది జాబితాలను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు నుంచి పూర్తి సహాయ సహకారం అందించాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకునేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: స్థానిక ఎన్నికల నేపథ్యంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఇటీవల ప్రదర్శించిన ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటులో అభ్యంతరాలపై సోమవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయాల్లో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓలు ప్రవీణ్‌కుమార్, లక్ష్మీఅనురాధ ఓటరు జాబితాలో అభ్యంతరాలపై వారితో చర్చించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం చలివేంద్రంపల్లిలో పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నాయకులు అధికారులకు కోరారు. కార్యక్రమంలో ఎంపీఓలు విజయ్‌కుమార్‌పాల్, హన్మంతురెడ్డి, సూపరింటెండెంట్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపాలి

షాబాద్: స్థానిక ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలని ఎంపీడీఓ అపర్ణ అన్నారు. గ్రామ పంచాయతీల వారీగా ఓటరు జాబితా విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయిలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలకు ఓటర్ జాబితా వార్డులు, పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రకటించామన్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సవరణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితాకు నాయకుల ఆమోదం

శంకర్‌పల్లి: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల నుంచి ఎలాంటి సవరణలు లేకుండా ఆమోదం లభించిందని ఇన్‌చార్జీ ఎంపీడీఓ గోపాలకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలతో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. నాయకుల ముందు ఓటరు జాబితా, పోలింగ్ బూత్‌ల వివరాలను వెల్లడించగా.. ఏ పార్టీకి చెందిన నాయకులు అభ్యంతరం తెలపకుండా ఆమోదం తెలిపారన్నారు. మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ, 1 జెడ్పీటీసీ స్థానానికి గాను మొత్తం 37,398 మంది ఓటర్లు, 70 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు వెల్లడించారు. అదే విధంగా ప్రభుత్వం ఎన్నికలు ఎప్పుడూ నిర్వహించినా, పార్టీలు తమ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీఓ గిరి రాజు, పలు పార్టీలకు చెందిన నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, వాసుదేవ్‌కన్నా, బయానంద్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను సరిచేస్తాం



షాద్‌నగర్: మాట్లాడుతున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలను స్వీకరించేందుకు వివిధ రాజకీయాల పార్టీల నేతలతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం కొత్త ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసిందన్నారు. దాంట్లో తప్పులు ఉంటే వాటిని సరిచేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలంలో మొత్తం 47 గ్రామ పంచాయితీలు ఉన్నాయని ఇందులో 89 పోలింగ్ కేంద్రాలను గుర్తించగా.. మొత్తం 51,104 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అందులో 25,396 మంది పురుషులు, 25,704 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. అదేవిధంగా కేశంపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీఓ జయంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.